ఏవోకు వినతిపత్రం ఇస్తున్న ప్రజా సంఘాల నాయకులు

## 'స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి'

ఖిలావరంగల్, అక్టోబర్ 4: నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల, వైద్యశాలలో స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో శ్రీకాకత్‌కు వినతిపత్రం అందజేశారు. స్వీపర్, అటెండర్, టెక్నీషియన్, ఎన్ఎం, జీఎన్ఎం సూపర్‌వైజర్, రిసెప్షనిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని స్థానిక దళిత కుటుంబాల్లోని అర్హులతో పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, ఎలకంటి రాజేందర్, పూలక్క, అజయ్, హరి బాబు, రంజిత్, వీరన్, సుకన్య, రవళి, అఖిల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అరుణా రాంచందర్

## 'సదస్సును విజయవంతం చేయాలి'

నర్సంపేట, అక్టోబర్ 4: ఈ నెల 6న జరుగనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయాలని నర్సంపేట టీజేఎస్ మహిళా కన్వీనర్ గుడిపూడి అరుణా రాంచదర్ పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో పాల్గొన్న మహిళలు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. ఆమె వెంట పద్మ, శైలజ, మాధవి, రజిత, సరోజన, అరుణ ఉన్నారు.

## బ్రహ్మచారిణి అలంకరణలో దుర్గామాత

అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించిన భక్తులు

నర్సంపేట, అక్టోబర్ 4: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు బ్రహ్మచారిణిగా పూజలు అందుకున్నారు. అలాగే, కరెన్సీ నోట్లతో దుర్గామాతను ధనలక్ష్మిగా అలంకరించారు. భక్తులు సామూహిక లలిత పారాయణం, కుంకుమ పూజ నిర్వహించారు. అంచూరు కృష్ణమూర్తి, నాగమల్ల కృష్ణమూర్తి, రామనాథం, శ్రీనివాస్, గోవర్ధన్, ఉపేందర్ పాల్గొన్నారు.

టీషర్ట్స్ పంపిణీ చేస్తున్న జన్ను రాజయ్య

## సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

కాశీబుగ్గ, అక్టోబర్ 3: ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని వరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్ జన్ను రాజయ్య పిలుపునిచ్చారు. 3వ డివిజన్‌లోని పైడిపల్లిలో భద్రకాళి యూత్ సభ్యులకు శుక్రవారం జన్ను స్వరూప, రాజయ్య దంపతులు 70 టీషర్ట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు జన్ను సుధాకర్, గట్టు బాలరాజు, ఇటికాల సాంబయ్య, జన్ను శంకర్, రాజ్‌కుమార్, బైరోని లడ్డూ, ఉప్పల రవి, రాజు, కొత్తకొండ కిట్టు, మడూరి సురేశ్, కోట శంకర్ పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికీ డిజిటల్ కార్డు అందించాలి

- పొరపాట్లకు తావు లేకుండా సర్వే చేయాలి
- కుటుంబాల సమగ్ర సమాచారం సేకరించాలి
- కలెక్టర్ సత్య శారద

వర్ధన్నపేటలో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర సత్యశారద

వర్ధన్నపేట, అక్టోబర్ 4: ప్రతి కుటుంబానికి కార్డు అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న డిజిటల్ కార్డు సర్వేను సమర్థవంతంగా నిర్వహించి, ప్రతి కుటుంబానికి స్మార్ట్ కార్డు అందేలా చూడాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. వర్ధన్నపేట పట్టణంలోని 11వ డివిజన్‌లో జరుగుతున్న సర్వేను శుక్రవారం తహసీల్దార్ విజయ్‌సాగర్‌తో కలిసి ఆమె పరిశీలించారు. అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డిజిటల్ కార్డు సర్వే చేపట్టిందన్నారు. పట్టణంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా సమగ్రంగా సర్వే చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కుటుంబ సమగ్ర సమాచారాన్ని సేకరించాలన్నారు.

**వరి పంటను పరిశీలించి కలెక్టర్**

వర్ధన్నపేట పట్టణం నుంచి వెళ్తున్న క్రమంలో కలెక్టర్ పట్టణ సమీపంలోని వరి పంటను పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలు, వరి ఎన్ని రోజులకు కోతకు వస్తుందనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. తెగుళ్లు ఉంటే అన్నదాతలకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆమె వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోనా, కౌన్సిలర్ తుమ్మల రవీందర్, మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**డిజిటల్ సర్వే పక్కాగా నిర్వహించాలి**

కాశీబుగ్గ: వరంగల్ 12వ డివిజన్ డాక్టర్స్‌కాలనీలో డిజిటల్ సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. సర్వేను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. కుటుంబంలో ఉన్న వ్యక్తుల పేర్లు, జెండర్, పుట్టిన తేదీ, వయస్సు, కుటుంబంతో సంబంధం, ఆధార్ నంబర్, అడ్రస్ వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. 12వ డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టుగా 120 కుటుంబాల సర్వేను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ కృష్ణారెడ్డి, ఆర్వో యూసుఫ్, షాజదిబేగం, ఆర్ఐ పాల్గొన్నారు.

**తప్పులు లేకుండా నమోదు చేయాలి**

దుగ్గొండి: పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని మదిర మందపల్లిలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను ఆర్డీవో కృష్ణవేణి శుక్రవారం పరిశీలించారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరి వివరాలను తప్పులు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని సర్వే బృందానికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లెక్కల అరుంధతి, తహసీల్దార్ రవిచంద్రారెడ్డి, ఎంపీవో మోడెం శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

**కుటుంబ సభ్యుల వివరాల సేకరణ**

సంగెం: పైలట్ ప్రాజెక్టుగా మండలంలోని కృష్ణానగర్‌లో చేపట్టిన డిజిటల్ కార్డు సర్వే కొనసాగుతున్నది. తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రవీందర్‌తోపాటు కార్యదర్శులు టీంగా ఏర్పడి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నారు.

దుగ్గొండి: సర్వే వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో కృష్ణవేణి

## సర్టిఫికెట్ల పరిశీలన పారదర్శకంగా ఉండాలి

ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

గిర్మాజీపేట, అక్టోబర్ 4: డీఎస్సీ-2024లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని కలెక్టర్ సత్య శారద జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో కొనసాగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్రతి అభ్యర్థికి ఫోన్ చేసి సమాచారం అందించి ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డీఈవో జ్ఞానేశ్వర్‌ను ఆదేశించారు. వెరిఫికేషన్ శనివారం పూర్తి కావాలని డీఈవోను ఆదేశించారు. జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలో 301 పోస్టులకు 903 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను 15 బృందాల ద్వారా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ కృష్ణమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

## కొలువుదీరిన ఆలయాల పాలకవర్గాలు

ప్రమాణం చేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

నెక్కొండ, అక్టోబర్ 4: మండలకేంద్రంలోని రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల పాలకవర్గాలు శుక్రవారం కొలువుదీరాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ మహబూబాబాద్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల వివరాలు వెల్లడించారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, సభ్యులుగా గుంటుపల్లి ప్రభాకర్‌రావు, కొత్తకొండ గణేశ్, రాపాక అనిల్, కొంగర హైమావతి-శ్రీనివాస్, అర్చకుడు బి.వి.ఎన్.శాస్త్రి ఎక్స్ అఫిషియో మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో సమత సభ్యులతో ప్రమాణం చేయించారు. ఏడాదిపాటు నూతన పాలకవర్గం పని చేయనుంది. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి, డీడీఎన్ అర్చక సమాఖ్య డివిజన్ అధ్యక్షుడు కృష్ణమాచార్యులు, వేద జ్యోతిష్య పండితుడు శ్రావణ్‌శాస్త్రి, అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అలాగే, ఆంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బెజ్జంకి వెంకటేశ్వర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా భూరుగుపల్లి భవిశాస్త్రి, సభ్యులుగా సోమ సత్తిరెడ్డి, దేవనబోయిన వీరస్వామి, కక్కెర్ల శ్రీనివాస్, కొలకనూరి యాకలక్ష్మి-శంకర్ ప్రమాణ స్వీకారం చేశారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాజు(ఫైల్)

ఖిలావరంగల్, అక్టోబర్ 4: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన శుక్రవారం ఎంజీఎం ఆస్పత్రిలో జరిగింది. వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పీ రాజు కథనం ప్రకారం.. దుగ్గొండి మండలం చలపర్తి గ్రామానికి చెందిన సోషల్ వర్కర్ మొలంగూరి రాజు(27) అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెందిన అతడు వరంగల్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం ఒకటి వద్ద గురువారం పురుగుల మందు తాగి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. వారు వచ్చి అపరస్మారక స్థితిలో ఉన్న రాజును అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి బాబాయ్ మొలంగూరి సత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

## వన్యప్రాణులను సంరక్షించాలి : ఎఫ్ఆర్వో

ఖానాపురం, అక్టోబర్ 4: వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా పాకాలలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణులపై అవగాహన కల్పించారు. అనంతరం ఎఫ్ఆర్వో మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. ఎవరైనా వేటాడితే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో సోమ, బీట్ అధికారులు రమేశ్, సునీత, సుదర్శన్, నార్య, కిరణ్, ఎకో టూరిజం అధికారి విజయ్, జయప్రకాశ్, రవి, మహేందర్, రాజు పాల్గొన్నారు.

పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏవో అనూరాధ

## పంట క్షేత్రాలను సందర్శించిన డీఏవో

నెక్కొండ, అక్టోబర్ 4: మండలంలోని ముదిగొండలో శుక్రవారం వ్యవసాయ పంట క్షేత్రాలను డీఏవో కె.అనూరాధ, ఏవో నాగరాజు క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు బయో ఉత్పాదిత మందులు వాడొద్దన్నారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సీఐ**

గీసుగొండ, అక్టోబర్ 4: డీజే నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బాబులాల్ హెచ్చరించారు. మండలంలోని డీజే నిర్వాహకులకు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని తహసీల్దార్ రియాజుద్దీన్ ఎదుట హాజరు పరిచి, సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా గ్రామాల్లో డీజేలు నిర్వహిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై కుమార్ ఉన్నారు.

**లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు**

గీసుగొండ, అక్టోబర్ 4: కొమ్మాల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో రెండు హుండీలను శుక్రవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీల ద్వారా రూ. 1,60,532 ఆదాయం సమకూరినట్లు ఆయన తెలిపారు. హుండీలో వచ్చిన వెండి, ఆభరణాలను తిరిగి హుండీలో వేశామన్నారు. ఆదాయాన్ని కొమ్మాల యూనియన్ బ్యాంకులో స్వామి వారి ఖాతాలో జమ చేశామన్నారు. ఈవో శేషగిరి, సిబ్బంది కనకయ్య, అనురాధ, అర్చకులు రామాచార్యులు, విష్ణు, ఫణింద్రాచార్యులు పాల్గొన్నారు.

**'భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'**

సంగెం, అక్టోబర్ 4: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోత్ సాగర్ కోరారు. మండలకేంద్రంలో శుక్రవారం మండల భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. వెల్ఫేర్ బోర్డులో ప్రైవేటు సంస్థకు అప్పజెప్పకుండా పెండింగ్‌లో ఉన్న క్లయిమ్‌లను రెన్యువల్ చేయాలన్నారు. ఈ నెల 20న నిర్వహించనున్న మండల మహాసభను విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. సమావేశంలో సాంబయ్య, శోభన్‌బాబు, ప్రకాశ్, బాబు, శ్రావణి పాల్గొన్నారు.

**గుడుంబా స్థావరంపై పోలీసుల దాడి**

చెన్నారావుపేట, అక్టోబర్ 4: గుడుంబా స్థావరంపై దాడి చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్కల్‌చెడ శివారు లచ్చినాయక్ తండాలో ఏఎస్సై లక్ష్మణమూర్తి సిబ్బందితో కలిసి గుడుంబా స్థావరంపై దాడి చేసి, 80 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని జాటోత్ భద్రుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిబ్బంది సురేశ్, స్వామి పాల్గొన్నారు.

**'హామీలను అమలు చేయాలి'**

సంగెం, అక్టోబర్ 4: ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని ఏఐకేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా కుంటపల్లిలో లఖింపూర్ కేరీ రైతు అమరులకు శుక్రవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో రాంచందర్, అశోక్, శ్రీనివాస్, సాంబయ్య, రాజు, పైడయ్య, శివకుమార్, రవి, శ్రీను పాల్గొన్నారు.

**అవగాహన కార్యక్రమం**

కరీమాబాద్, అక్టోబర్ 4: పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని మామునూరు కృషి విజ్ఞానకేంద్రంలో ప్రపంచ జంతువుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం పశువైద్య శాస్త్రవేత్త డాక్టర్ సాయికిరణ్ మాట్లాడుతూ జంతువులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలతో లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

నరేందర్‌ను పరామర్శిస్తున్న సాంబారి సమ్మారావు

## నరేందర్‌కు సమ్మారావు పరామర్శ

గిర్మాజీపేట, అక్టోబర్ 4: వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ను శుక్రవారం శివనగర్‌లో జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు పరామర్శించారు. ఇటీవల నరేందర్ సోదరుడు రవికుమార్ మరణించిన విషయం తెలిసిందే. సమ్మారావు వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

**క్రీడాకారిణికి సెల్‌ఫోన్ బహూకరణ**

సెల్‌ఫోన్ అందజేస్తున్న తండావాసులు

రాయపర్తి, అక్టోబర్ 4: పన్యానాయక్ తండాకు చెందిన అంతర్జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారిణి ఆంగోత్ కావేరికి తండావాసులు శుక్రవారం రూ. 15 వేల విలువైన సెల్‌ఫోన్‌ను బహూకరించారు. తండాలో నిరుపేద కుటుంబానికి చెందిన కావేరి గత నెలలో సౌత్ కొరియా రాజధాని సియోల్‌లో జరిగిన ఫుట్‌బాల్ ప్రపంచ కప్ పోటీల్లో పాల్గొని ఐదో స్థానంలో నిలిచింది. తండాకు మంచి పేరు తీసుకొచ్చిన కావేరికి స్మార్ట్‌ఫోన్‌ను అందజేసినట్లు తండాకు చెందిన భూక్యా లక్పతి, బదావత్ వీరూనాయక్, భూక్యా రాజారంనాయక్, భూక్యా శ్రీనివాస్, ముడావత్ బాలాజీ, ఆంగోత్ అనిల్, ఆర్టీసీ కండక్టర్ ఆంగోత్ రాజేశ్, భూక్యా యాకూనాయక్ తెలిపారు.

**9న కలెక్టరేట్ ఎదుట నిరసనలు**

కాశీబుగ్గ, అక్టోబర్ 4: ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్‌రెడ్డి వ్యతిరేకంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఈ నెల 9న కలెక్టరేట్ ఎదుట నల్ల జెండాలతో ప్రదర్శన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ తీర్మానం చేసింది. వరంగల్ 18వ డివిజన్‌లోని ప్రతాప్‌నగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజశేఖర్, కందికట్ల విజయ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అంబేద్కర్ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తామని, మాదిగలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, సుధాకర్, మల్లన్న, రాజు, నారాయణ, చింతం సిద్ధూ, చందు, రాము, అజయ్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీని కలిసిన దసరా ఉత్సవ కమిటీ**

కాశీబుగ్గ, అక్టోబర్ 4: కాశీబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా సారయ్యను సత్కరించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దూపం సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, కన్వీనర్ బయ్యాస్వామి, నిర్వాహకులు పాల్గొన్నారు.

**ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ సేఫ్**

చెన్నారావుపేట, అక్టోబర్ 4: ట్రాక్టర్ బోల్తా పడిన ఘటన మండలంలోని గొల్లపల్లెలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోస్కుల ప్రభాకర్ నర్సంపేటలో పని ముగించుకొని ట్రాక్టర్‌లో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి పొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రాణాలతో బయట పడ్డాడు. కాగా, రోడ్డు సరిగా లేక ఇలాంటి ఘటనలు నిత్యకృత్యమయ్యాయని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఖాదర్‌పేట నుంచి గొల్లపల్లె వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై పనులు ప్రారంభించారని గ్రామస్తులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

**ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ల గడువు పెంపు**

మట్టెవాడ, అక్టోబర్ 4: ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్ చదవాలనుకునే వారు అపరాధ రుసుంతో అడ్మిషన్లు తీసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు ప్రభుత్వం గడువు పెంచినట్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మట్టెవాడ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ కన్నం అరుణ తెలిపారు. వివరాలకు అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అజయ్ బాబు 8919260509, 9951624126 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

**'భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి'**

చెన్నారావుపేట, అక్టోబర్ 4: చెరువు శిఖం భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్‌కు రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారని సమాచార హక్కుచట్టం పరిరక్షణ కమిటీ సభ్యుడు కాట కుమారస్వామి శుక్రవారం తెలిపారు. జల్లి గ్రామ శివారులోని రావికుంట చెరువు శిఖం భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని అనేకసార్లు తహసీల్దార్, ఆర్డీవోకు వినతిపత్రాలు అందించినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లిఖిత పూర్వకంగా రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా ఆయన ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీకి కుమారస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

**రైల్వేస్టేషన్‌లో ఇద్దరు దొంగల అరెస్టు**

ఖిలావరంగల్, అక్టోబర్ 4: రైళ్లలో దొంగతనాలకు పాల్పడిన ఇద్దరిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ సీఐ పీ సురేందర్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ గార్లకు చెందిన గొడుగు నవీన్(21), ఖమ్మం జిల్లా ఏకునూరు మండలం రాజులపాలెం తండాకు చెందిన గుగులోత్ నరేశ్(25) సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలులో రూ. 3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులను ప్రయాణికుల నుంచి చోరీ చేశారు. అనంతరం వరంగల్ రైల్వేస్టేషన్‌లోని మూడో నంబర్ ప్లాట్‌ఫాంపై అనుమానాస్పదంగా తిరుగుతున్నారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

**ముగిసిన శిక్షణ తరగతులు**

కరీమాబాద్, అక్టోబర్ 4: ది హైదరాబాద్ పబ్లిక్ పాఠశాలలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ వారు నియమించిన రిసోర్స్‌పర్సన్ విశ్రాంత డిప్యూటీ కమిషనర్, కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు చెందిన పీవీ సాయి, ది నల్లగొండ పబ్లిక్ స్కూల్ చర్లపల్లి హెచ్ఎం పార్థసారథి గోవర్ధనం ఆధ్వర్యంలో 'నూతన విద్యావిధానంలోని మెలకువలు-పరీక్షల విధివిధానాలు' అంశంపై ఉర్సు బైపాస్ రోడ్డులోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు రెండు రోజులు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలని టీచర్లకు సూచించారు.

**మంచినీటి సహాయకులకు సర్టిఫికెట్ల ప్రదానం**

సంగెం, అక్టోబర్ 4: మండలంలోని మంచినీటి సహాయకులకు ఇస్తున్న శిక్షణ శుక్రవారం ముగిసింది. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మంచినీటి సహాయకులకు ఎంపీడీవో కార్యాలయంలో గత నెల 30న ప్రారంభమైన శిక్షణ కార్యక్రమం నాలుగు రోజులపాటు కొనసాగింది. అనంతరం సర్టిఫికెట్లు అందించారు.

## నీటి సరఫరాలో అవాంతరాలు ఉండొద్దు

- మేయర్ గుండు సుధారాణి
- దేశాయిపేట ఫిల్టర్ బెడ్ ఆకస్మిక తనిఖీ

నీటిని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

కాశీబుగ్గ, అక్టోబర్ 4: నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూడాలని మేయర్ గుండు సుధారాణి సూచించారు. దేశాయిపేట లోని ప్రతాపరుద్ర ఫిల్టర్‌బెడ్‌ను శుక్రవారం మేయర్ తనిఖీ చేశారు. నీటి సరఫరా తీరు, నీటి నాణ్యత నిర్ధారణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధర్మసాగర్ నుంచి వచ్చే నీటిలో మలినాలు తొలగించడానికి కలిపే రసాయనాల మోతాదును మేయర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నీటిలో మురికి సాంద్రత పెరిగినందున ఆలంతోపాటు క్లోరిన్ డోసు పెంచి శుద్ధికరించాలని, నీటి నాణ్యత ఆధారంగా కార్బన్‌ను జత చేయాలని సూచించారు. ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా శుద్ధి చేసిన తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. అంతకుముందు నీటి నాణ్యత నిర్ధారణ పరీక్షలను మేయర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఈఈ శ్రీనివాస్, డీఈ రంగారావు, కృష్ణమూర్తి, రవీందర్ పాల్గొన్నారు.

### ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

ఖిలావరంగల్, అక్టోబర్ 4: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఒకరి ప్రాణాలను కానిస్టేబుల్ కాపాడాడు. వివరాల్లోకి వెళ్తే.. హనుమకొండ ఎన్జీవో